పంచపాత్ర

కే ఎ స్వీ

6

(గత సంచిక తరువాయి)

అబ్బో! ఎన్ని చిత్రాలు! ఎన్ని దృశ్యాలు! నలుపు తెలుపులవి! రంగు రంగులవి! రకరకాలవి! చిన్నవి- పెద్దవి!

ఫేడౌట్ అయిపోతా అయిపోతూ చిన్నప్పటి పరిచయస్థుల ముఖాలు .....

బంతాటలో బోర్లపడిపోయి మోకాలు గీసుకుపోయిన ఎర్రటి రక్తం...

తల్లి ముఖం తండ్రిముఖం ఎందుకు గుర్తొస్తుందో గాని- మాటిమాటికీ మధుర ఆలయంలో మీనాక్షీదేవి ముఖం...

చెల్లెలి గయ్యాళిముఖం...ఎత్తుపళ్ళతో సహా...

వొకానొక కుష్ఠురోగి కురుపుల ముఖం...

ఏదో పెళ్ళిలో ఏదో గదిలో పైట సర్దుకుంటూ స్తనాలు బహిర్గతం చేసిన స్త్రీ-ముఖం గుర్తులేదు...

సినిమాల్లో సెక్సు దృశ్యాలు-ఎన్నెన్నో ...... అందమైన మాంసం-స్త్రీ మాంసంలో వొంపు-బరువు-విశృతపు మెరుపు- వాళ్ళ నవ్వుల కృత్రిమత్వంలో సహా అచ్చుపడిన కొన్ని ఘట్టాలు- స్నాన ఘట్టాలు-పడకటింటి దృశ్యాలు...

వివరో స్నేహితుడింట్లో వొక స్త్రీ మేడపైనుంచి కాలుజారి పడిపోయిన దృశ్యం...ఆమె తలమీద రక్తం-

మోటారుకారు ప్రమాదంలో బుర్ర చితికి చచ్చిపడిన పిల్లవాడి శవం-రక్తం-

ఎక్కడిదో తెలీదు-ఇళ్ళు కాలుతూన్న దృశ్యం-మంటల ఎరుపు-రక్తంలాంటి ఎరుపే!......

స్ట్రెచర్‌మీద ఎవర్నో తీసుకెళ్తున్నారు

కుక్కపిల్ల కంట్లో అసహ్యమైన పుసి

థియేటర్‌లో వొకసారి పక్కన కూచున్న కళ్ళజోడు యువతి (ఇప్పుడెక్కడుందో-) అద్దాలుమాత్రం బొమ్మలో వున్నాయి. ముఖం అసలు లేనే లేదు......

బిగుతుగా చీరె ధరించి వంకర టింకరగా నడిచిన పదేనిమిదేళ్ళ పిల్ల

హెడ్‌క్లర్క్ వరదరాజులుగారి రెండో పెళ్ళాం రొమ్ములు...

కిరసనాయిలు క్యూ

న్యూస్ రీల్లో ఇందిరా గాంధీ

లంచమివ్వడాని కొచ్చిన పెద్దమనిషి కళ్ళలో కంత్రీతనం

కూరగాయల మార్కెటులో కొత్తిమిర అమ్మే స్త్రీ ముక్కుమీద పెద్ద పులిపిరి మచ్చ

"ఇక్కడ కాగితములు అంటించరాదు" గోడమీద బోర్డు

"ఇక్కడ ఉచ్చపోయరాదు-" అదీ వొక బోర్డే

"నో వేకెన్సీ" అది బోర్డు కాదా మరి

"అప్పులేదు" పచారి కొట్లులో ఎప్పుడూ వెక్కిరించే బోర్డు.

స్కూటర్‌మీద వెళ్ళే పిల్ల వేసుకున్న బర్మాముడి.

కూలిన వొంతెన ఎలెక్ట్రిక్ షాక్‌తిని చచ్చిపోయిన ఆడమనిషి మెటర్నిటీలో వరుసగా పసికందుల ముఖాలు- ఓ! అన్నట్లు-ఎన్ని సూర్యోదయ సూర్యాస్తమయాలు-మబ్బుల్తో సరసాలాడే చంద్ర యానాల రమ్యదృశ్యాలు...కొబ్బరాకులమీద వెన్నెల మెరుపులు- అప్పుడెప్పుడో కాలేజీ దినాల్లో స్నేహితురాలు (!)-రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు-చెయ్యూపుతూ దూరమైపోయిన ఆనాటి ఆ దయామయి జాలినిండిన ముఖం...మరిచిపోవడానికి వీలు లేదు వీలేలేదు- దినానికో రకంగా మారుతూ చంద్రకాంత్‌కే ఎప్పటికప్పుడు వింతగా కనిపిస్తూ వచ్చిన చంద్రకాంత్ ముఖం......

...అద్దంలో చంద్రకాంత్!!! ...

ఎన్ని దృశ్యాలవి! అలా ఎన్ని దృశ్యాలవి!—

నవ్వించి కవ్వించి ఏడ్పించి పుసిగొలిపి లాలించి బుజ్జగించి వొదార్చేవి-అన్నీ-అవి అన్నీ దృశ్యాలు......

చంద్రకాంత్ కళ్ళు కెమెరా లెన్సులుగా పనిచేసి అతని మనసనే ఫిల్ముమీద మాంత్రిక చిత్రాల్లా ముద్రించుకుపోయినవి- అవే దృశ్యాలు!!

చంద్రకాంత్ గురించిన చంద్రకాంత్‌కే తెలియని నిజాలకి అవే సాక్ష్యాలు! ప్రబల సాక్ష్యాలు!!

మెదడు కాలిపోతోంది, చంద్రకాంత్ మనసుతో నా మనసుకి జ్వరం తగిలింది. ఇహ తట్టుకోలేక చంద్రకాంత్ మనసుని మరీ లోతుగా పరీక్ష చెయ్యడం (!) ఆపేసేను. చం. కాం మనసుని మళ్ళీ ఆ పసుపురంగు మైనపు కాగితంలో పెట్టి జాగ్రత్తగా కట్టేసేను. నవల రాసే రాసాను. లేకపోతేలేదు ఆ మనసున్నేను మళ్ళీ స్వంత దారుడికి చేర్చకపోతే-పాపం, అతనేమైపోవాలి ?!

“హమ్మయ్య” అనుకుంటూ కొత్త సిగిరెట్టు వెలిగించేను.

చంద్రకాంత్ మనసు గురించే ఆలోచిస్తూ వున్నాను. చైతన్య స్రవంతిలో రాయాలనుకుని చాలా రోజులుగా నేను వాయిదా వేసుకుంటూ వొస్తూన్న నవలకి చంద్రకాంత్ మనసుని వస్తువుగా ఎంచుకుంటే ?

ఆలోచిస్తూనే వుండగా గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

కిటికీలోంచి నగరం కనిపిస్తోంది. దీపాల నగలతో నవ్వుతూ పిలుస్తోంది.

వెళ్ళి అలా తిరిగిరావాలని వుంది. కాని, ఊఁహూఁ – తల దిమ్ముగా వుంది. మెదడంతా పింజలు పింజలై తేలిపోతూ తూలిపోతోంది...

భోంచేసే వోపికకూడా లేదు.

అసలు ఆకలే లేదు.

పక్కమీద వాలేసరికి నల్లగా మెత్తగా మత్తుగా వొచ్చి వాలింది నిద్ర. కావలించుకున్నాను. అంతే! రాయిలాగా నిద్రపోయేను......

ఏదో పురుగు దొలుస్తూంటే వులిక్కిపడ్డాను. చెవులో దూరింది పురుగేదో అనుకుంటూ చెవులో చిటికెన వేలుదూర్చి గిరకొట్టి చూసేను. అప్పుడే తెలిసింది-నన్ను మేలుకొల్పిందొక పురుగుకాదని. వొక రింగ్ రింగ్ మనే శబ్దం నాచెవిలోకి పురుగులా దూరిందని... ...

రింగ్ రింగ్‌మని మ్రోగుతూనేవుంది టెలిఫోన్.

బెడ్‌లైట్ స్విచ్ నొక్కి వాచీ చూసుకున్నాను. ఒకటిన్నర.

ఇంతరాత్రివేళ నాకు ఫోన్లు ఎక్కణ్ణుంచీనూరావు. ఇదేదో రాంగ్ నంబరే అయి వుంటుందనుకుంటూ రిసీవరెత్తి అతి ప్రయత్నం మీద (అంత గాఢనిద్రలో వున్నాను మరి –) చెవికి ఆన్చుకుంటూ “హలో !...” అన్నాను.

అవతల్నుంచి ఉలుకూ పలుకూలేదు. వొళ్ళు మండింది. రిసీవర్ పెట్టేద్దామనుకుంటూనే “హలో” అన్నాను మళ్ళీ.

“హలో” – అంది అవతల్నుంచి వొక తియ్యని కంఠం. తియ్యటి స్త్రీకంఠం.

నాకు ట్రంకాల్స్ ఎక్కణ్ణుంచీనూ రావు. పోగా, నాకు ఫోన్‌చేసే స్త్రీ పరిచయస్తులు లేరు ఇది తప్పని సరిగా రాంగ్‌నంబరే అనుకుంటూ “ఆనందరావ్ స్పీకింగ్–” అన్నాను, అవతలావిడే ఫోన్ పెట్టేస్తుందన్న ఆశతో.

“ఎవరన్నారూ ?–” అంది ఆ స్త్రీ కంఠం. చిన్నప్పట్నుంచి గులాబ్‌జామ్‌లే తిన్నట్టుగా వుంది. అంత తియ్యగావుంది గొంతు.

“ఆనందరావు – కె. ఆనందరావు–” అన్నాను అసహనంగా– అంత తియ్యటిగొంతు విన్నప్పటికీ అసహనం వదలేదు (అంతగాఢ నిద్రలో వున్నాను మరి–) “మీకెవరు కావాలి ?–”

“మీరే కావాలి–” అంది ఆ స్త్రీ, స్పష్టంగా.

అదిరిపడ్డాను.

1976 సంవత్సరపు జోకేమిటి ? వొకటిన్నరకి – రాత్రి వొకటిన్నరకి ఫోను–నువ్వే కావాలనే స్త్రీ !

“ఆనందరావంటే– కె. ఆనందరావుని నేను కథలవీ రాస్తుంటానండి–” అంటూ నా అడ్రెస్ చెప్పేను–“బహుశా మీక్కావలసిన ఆనందరావు వేరే వున్నారేమో !–” అన్నాను.

“నో-నో-మీరేకావాలి–”

“క్షమించాలి-మీరెవరోకూడా నాకు తెలీదు–”

“దానికేం ? మీరెవరో నాక్కూడా తెలీదు–”

“మరి–”

గలగల గలగలమని నవ్వింది. “ఇంతకుముందు తెలీకపోతే ఇప్పుడు తెలుసుకోకూడదూ ?–”

“తెలుసుకోవొచ్చు. తప్పులేదు. కాని, ఇదేమిటి ? – అర్ధరాత్రి– టెలిఫోన్‌మీద–మీరెవరో నాతో హాస్యాలాడుతున్నారు–”

“ఊఁ-ఊఁ–” అంటూ అలాగే సాగదీసి ఆపుకోలేక గలగలా కెరటాలు కెరటాలుగా నవ్వేసింది– “ఐలైక్యూ! ఐలైక్యూ–ఆనందరావ్ !...” అంది జీరగొంతుతో.

ఇదేదో అసాధారణ పరిస్థితని తేలిపోయింది

“ఇంతకీ–మీరెవరో చెప్పనేలేదు–”

“రంజని, రాజేశ్వరి, సుమిత్ర, కాదంబరి, సుప్రియ, కృష్ణవేణి, మంజుల, లత, అనిత, వనిత. వినత, ఊఁ... (నవ్వు)... వీణ, వాణి, రాణి...మీ ఇష్టం–ఏపేరుతోనైనా పిలవండి–పలుకుతాను–”

ఈవిడెవరో గడుసుమనిషని అర్థమైంది–

"సరే - నాకే విందుకు ఫోన్‌చేసేరిప్పుడు మీరు? ఎక్కణ్ణుంచి మాట్లాడుతున్నారు? అసలింతకీ-వ్వాట్ కెన్నైడూ ఫర్యూ?-"

"ఎన్ని ప్రశ్నలు!..."

"వొక్కొక్క ప్రశ్నకే సమాధానం చెప్పండి చాలు..."

"వూఁ-" అంటూ నోరు తెరవకుండానే నవ్వింది — "నిద్ర పట్టలేదు. చేతికొచ్చిన నంబరు డయల్ చేస్తూ వున్నాను. ఎవ్వరూ రిసీవ్ చెయ్యటంలేదు పది పదిహేను కాల్స్- వూఁహూఁ - లిఫ్టింగేలేదు. మీరొక్కరే 'హల్లో' అన్నారు చివరికి. ఇంత పెద్ద రాత్రిలో - ఇంత పెద్ద నగరంలో మీరొక్కరే "హల్లో" అంటే "హల్లో" అన్నారు. ఐ సే-ఐలైక్యూ-ఐలైక్యూ-"

"ఎక్కణ్ణుంచి-ఫోన్ చెయ్యడం? "

"ఇంటనుంచే-మా ఇంటినుంచే-బెడ్ రూంనుంచే-"

"సరే-హల్లో-అన్నాను. అంతే చాలా? ఇంకా ఇప్పుడు నేను మీ గురించి చెయ్యగలిగిందుందా?-"

"మంచి నిద్రలో వున్నారు కాబోలు-"

"వూఁ-" అన్నాను నిద్రను అభినయిస్తూ.

"నాకోసం కాస్త నిద్ర వాయిదా వెయ్యలేరూ?-"

"ఎందుకూ?-"

"మీరు వెంటనే బైల్దేరి రావాలి-"

"గాడ్! ఎక్కడికి?-"

"ఉలిక్కిపడనక్కర్లేదు. మా ఇంటిక్కాదులెండి ... సిటీ పార్క్ దగ్గరేగా మీరుంటున్నది...ఆ పక్కనే టవర్ క్లాక్ దగ్గిరికి పావుగంటలో రావాలి మీరు..."

"ఎందుకు?-"

"వొస్తే చెప్తాను?-"

"అసలు మీ పేరు?-మీ ఫోన్ నంబరు"

"ఆహ-ఈ డిటెక్టివ్ బుద్ధులన్నీ నాకు తెలుసులే! కాని, నీకు ధైర్యముంది కదా?-"

"బోలెడు-" 'మీకు' అనేదల్లా 'నీకు' అంటోండడం నేను గమనించకపోలేదు!

"అయితే పావుగంటలో టవర్‌క్లాక్ దగ్గిరికి వొచ్చెయ్యి. వో. కె?-"

ఇదేదో-ఈ తమాషా చూడాలని నాకూ వుంది. కాని, నిద్ర?

"వో కె?-" అన్నాను-నా మటుకు నేను ఎటూ నిర్ణయించుకోకుండా.

"థేంక్యూ-" అని ఫోను పెట్టేసింది ఆవిడ.

నేనూ ఫోను పెట్టేసేను.

కాని, సగం నిద్ర నుంచి లేచొచ్చిన పక్కవేపు చూసేసరికి నిద్ర మళ్ళీ ముంచుకొచ్చింది.

ఈ టెలిఫోను యువతెవరు?

కొంపదీసి ఇంకో పాత్ర కాదుగదా! నిద్రకూడా మానుకుని పాత్రల గురించి తలబద్దలు కొట్టుకుంటే నేనేం కావాలి?

మళ్ళీ నిద్రపోవడానికే నిశ్చయించుకున్నాను. అంతలో—

మళ్ళీ రింగ్ రింగ్‌మంది టెలిఫోన్!

"హల్లో" అన్నాను.

"ఆనందరావ్!?-"...ఆవిడే!

"అవును-"

"నిద్ర కంటిన్యూ చేసేద్దామనుకుంటున్నావ్ కదూ?-" అంది.

ఎలా కనిపెట్టేసింది? టెలిపతీగాని వుందా?

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

— చందా వివరాలు —

విడి ప్రతి వెల ... 0 - 75 పైసలు

	న్యూస్ ఏజంటుద్వారా		పోస్టుద్వారా	
	రూ.	పై.	రూ.	పై.
సంవత్సర చందా	39-00		41-60	
అర్ధ సంవత్సరం	19 50		20-80	
మూడు మాసములకు	9-75		10-40	

మేనేజరు
ఆంధ్రపత్రిక

"ఎలా కనిపెట్టేసే ననుకుంటున్నావ్ కదూ? నాకేం టెలిపతీ లేదులే ..కాని, నీతో అయిదు నిమిషాలసేపు టెలిఫోన్‌మీద మాట్లాడి-నీ బుద్ధి కనీసం అమాత్రం కనిపెట లేనూ?-"

ఇది మరీ విడ్డూరం. అబద్ధాలెందుకని నిజమే చెప్పేను—

"మీరు చెప్పింది నిజమే-నిద్రపోదామనుకుంటున్నాను—

"నువ్వు నన్ను మీరనడం బాగులేదు. మర్చిపోయేవా?– మనం పదున్నర నిమిషాలనుంచీ స్నేహితులం.. చనువుగా పిల్చుకోడానికి ఆ మాత్రం పరిచయం చాలు ... ఇహపోతే- చూడానందరావ్... ఇంకో పది నిమిషాల్లో నువ్వు టవర్‌క్లాక్ దగ్గరికి రాకపోతే రేపు ఈవినింగ్ ఎడిషన్లో వొక స్త్రీ ఆత్మహత్య గురించి చదువుకుంటావు ..నేను ఇంతవరకు ఎప్పుడూ మాటతప్పలేదు-"ఆమె ఫోను పెట్టేసింది.

ఇహ తప్పేట్టు లేదు. ఇంతవరకు ఆమె చేసిన పనులేవీ సవ్యంగా లేవు ఇకపైన అపసవ్యమైన పనులు చెయ్యకుండా వుంటుందని హామీ ఏమీలేదు. నేను వెళ్ళకపోతే ఆత్మహత్య చేసుకున్నా ఆశ్చర్యంలేదు. అదీగాక, ఈ విచిత్ర వ్యక్తిత్వం ఏమిటో చూద్దామని నాకూ వుందికదూ? పైజమ్మామీద లాల్చీ తొడుక్కొని సిగిరెట్టు ప్యాకెట్టూ లైటరూ తీసుకుని గదికి తాళం పెట్టేను. చిడీలు దిగుతూంటే చలిగాలి జువ్వ్వుమని లాగికొట్టింది. పళ్ళు పీకేయి. సిగిరెట్టు లిగించి రోడ్డెక్కి నడక సాగించేను......

టవర్‌క్లాక్ దగ్గరికెళ్ళి ల్చున్నాను.

రెండు కావొస్తోంది!

ఆమె ఎక్కడుంటోంది? ఎలా వొస్తుందిక్కడికి? అసలొస్తుందా రాదా?

కొంపదీసి ఇదంతా ఒక ప్రాక్టికల్ జోక్ కాదుగదా!

ఎవరికి చెప్పినా ఎవరూ నమ్మరు.

హాస్యాస్పదం. అసంబద్ధం.

నా ప్రక్కగా కారొచ్చి ఆగింది. నల్ల ఫియెట్. నావేపు తలుపు తెరుచుకుంది. 'గెటిన్ ప్లీజ్''-ఫోన్‌లోనైనా బైటైనా ఆగొంతును అవలీలగా గుర్తుపట్టొచ్చు.

కూచున్నాను. కారు కదిలింది.

"ఎలా గుర్తుపట్టేరు నన్ను!?-" అన్నాను, ఆమెవేపు చూడకుండా.

"ఎదురుచూసే మనుషులెలా వుంటారో నాకుతెలుసు"—అంది. "మాటప్రకారం వొచ్చినందుకు నీకు మెనీ థేంక్స్ — మనిషనే తోడు లేక పిచ్చిపట్టినట్టుంది... నువ్వురాకపోతే సూయిసైడ్ ఎలా చేసుకోవాలా అని ఆలోచిస్తున్నాను..." చాలా సిన్సియర్‌గానూ సీరియస్‌గానూ అంది.

ఆశ్చర్యపడ్డం, ఆశ్చర్యపడ్డట్టు కనిపించడం—ఎప్పుడో మానుకున్నాన్నేను.

"నీకు మరీ ఇబ్బందయితే—వెళ్ళిపో!-" అంది కారు వేగం తగ్గిస్తూ—...నా ముఖభావం గమనించిందేమో!

"అబ్బే లేదు-" అన్నాను.

"వూహూం-మాటప్రకారం వొచ్చేవుగా-అంతేచాలు — ఇంక నువ్వు వెనక్కి వెళ్ళిపోయినా నేను ఆత్మహత్య చేసుకోను-"అందామె.

నవ్వొచ్చింది నాకు.

నేను కాఫీ తాగను నేను కాఫీ తాగుతాను—అన్నంత సుళువుగా -నేను ఆత్మహత్య చేసుకుంటాను... నేను ఆత్మహత్య చేసుకోను— అంటోంది ఆమె.

"ఏం నవ్వుకుంటున్నావూ?..." అంది.

"ఏమీలేదు"-అంటూ ఆమెకేసి తిరిగేను.

ఆశ్చర్యం.

ఆమె అద్భుత సౌందర్యవతి.

జరీఅంచు నల్లచీర. నల్ల రవిక, బన్ పెట్టకుండానే చుట్టేసిన కొప్పు.

కాటుకలేదు. లిప్‌స్టిక్‌లేదు. మెడలో ఏమీలేదు. కుడిచేతికి స్కేర్ వాచీవుంది. ఇంకే ఆభరణాలూ లేవు.

ఏ ఆభరణాలూ ఇవ్వలేని సహజ సౌందర్యం ఆమెలోవుంది. లక్షలమంది ప్రేక్షకులచేత ఆరాధింపబడే సినిమా తారలు ఆమెముందు దిగదుడుపు.

"నేను అందమైనదాన్ని-" అందామె. నన్ను కనిపెట్టింది.

ఎలా ఈవిడతో?

ఈవిడముందు ఆలోచించినా ముప్పే!

"అంతేకాదు-నీకు తెలివికూడావుంది-"అన్నాను.

"థేంక్స్ నన్ను మిత్రుళ్ళాగా — నువ్వు —అని పిలిచేవు. ఐలైక్యూ ... ..."

"నువ్వనుకుంటున్నంత విచిత్రంగా లేదిదంతా నాకు..."

"ఆ సంగతి నాకుతెలుసు-" అంటూ నవ్విందామె—"నువ్వొక రచయితవి కదూ?-".

"తెలిసే ఫోన్ చేసేవా?-"

"ప్లీజ్ నమ్మునన్ను-ఇందాకా వస్తూ ఆలోచించేను—అవును— కె. ఆనందరావ్—నీ కథలు చదివేన్నేను-"

నిర్జనమైన వీధులగుండా దర్జాగా వెళ్తోంది కారు. ఆమె హేలగా అవలీలగా డ్రైవ్ చేస్తోంది. ఎక్కడికని నేనడగలేదు

మనిషి జీవితంలో మరపురాని సంఘటనలు కొన్ని, రచయితగా నా జీవితంలో మరపురానిది ఈ ఘట్టం. ఇంత అందమైన ఈ స్త్రీ అసలు నా కథ అచ్చయిన పుస్తకాన్ని ముట్టుకోవడమే నాకు గొప్ప. నన్ను తన ఫ్రెండని పిలిచి అర్ధరాత్రివేళ తనతోబాటు కార్లో తిరగమని అడిగితే ? – నాకేం ?–ఎక్కడికైతే నాకేం ?

"నీ కథలేం బావుండవు-" అందామె, కారు మలుపు తిప్పుతూ–

ఆ మాటతోనాకు అగాధంలోకి పడిపోయినట్టనిపించలేదు.

తిరస్కారాలు నా కలవాటే !

"థేంక్స్ !-" అన్నాను సిన్సియర్‌గానే !

"యు ఆర్ నాటీ !..." అందామె పల్వరుస కనిపించేలా నవ్వుతూ. "నీ కథల్లో మసాలా తక్కువ. అంటే తెలుసుగా......"

"సెక్సు–"

"అంతేకాదు – ప్రేమ – త్యాగం – అభిమానం - మమత– మమకారం – ఇవన్నీ వుండాలి. ఈ భావాలుకాదు. ఈమాటలున్నా చాలు... ...నువ్వు హిటయి పోతావు... ..."

"నా కథలగురించి మాట్లాడకు – నీగురించి చెప్పు–నీ పేరేంటి ?–"

"నువ్వే పేరు పెట్టు–నేను పలక్కపోతేవొట్టు–"

"రూప." అన్నాను.

"మంచిపేరు. కాని నాకిష్టంలేదు – ఎందుకని అడక్కు– నువ్వలాగే పిలు...నీకోసం నేను పలుకుతాను..."

"థేంక్స్ !–"

సెకండ్‌షో జనాన్ని చీల్చుకుపోయింది కారు. "ఎక్కడికి తీసుకెళ్తున్నానని అడగవేం ?–"

"నీకే తెలీదని నాకు తెలుసు–"

"ఇలా చెప్పకుండానే అన్నీ తెలిసిపోతే ఎన్ని చిక్కులు!–"

"ఏం చిక్కులు!?"

"అదీ నీకు తెలుసు–"

"సరే–నీ మీద నవల రాయనా ?–"

"అంతకన్నా–నన్ను ప్రేమిస్తాననరాదూ?–హొక్కసారిగా–"

"నీకు పెళ్ళయిందనుకుంటాను–"

"కాలేదు. కాని అయినట్టే లెక్క–"

పెళ్ళి ప్రసక్తితో ఆమెలో విచిత్రమైన మార్పొచ్చింది.

"ఆయన-అంటే రాజాగారు-సరదా పురుషుడు. వాళ్ళూర్లో సంసారం వుంది. నెలకో మూడ్రోజులు సిటీకొచ్చి నాతో ఘంటా డంతే...అందుకోసం నాకో బంగళా ఇచ్చేడు, కారిచ్చేడు, బ్యాంకులో అకౌంట్ కూడా..."

"లక్షాధికారి కాబోలు–"

"కేవలం పలుకుబడితో పదిహేంది లక్షాధికార్లను కొనగలడు- అదృష్టవంతురాల్నికదూ నేను?..."

"ఆయన్దీ అదృష్టమే...!"

"కాని ఆయనకిది లాభంలేని బేరం...అయినా అదేమిటో మోజు...ఆయన లేనప్పుడు అంతా నా యిష్టం...ఏం చేస్తానో ఎలా వుంటానో ఆయన అడగరు–పట్టించుకోను గూడా పట్టించుకోరు–కాని, వేరే ఎవర్తోనూ నా కవసరంలేదు-ఇష్టమూలేదు–"

ఆలోచిస్తున్నాను.

"సిగిరెట్టుందా?–" అని అడిగి నా దగ్గర్నుంచి తీసుకుంది.

లైటరుతో నేనే వెలిగించేను.

అందం ఆమె ప్రతి కదలికలోనూ వుంది.

నిజానికి అసలైన అందమేదో ఆమె లోపల-ఆమె మనసులో వుంది!

ఎందుకోగాని సడెన్‌గా మా మధ్య మాటలు ఆగిపోయేయి.

కారు చేసే శబ్దంతప్ప ఇంకే శబ్దమూలేదు.

సిగిరెట్ పొగ ఆమె అతి నాజూగ్గా వొదులుతూ మధ్యమధ్యన తనతో తాను నవ్వుకుంటోంది. నా ఉనికిని మర్చిపోయిందా? అనిపించింది కొంతసేపు.

మెయిన్ రోడ్డుమీద అటూ ఇటూ దీపాలు జిగేల్ జిగేల్మని వెలుగుతున్నాయి.

తారురోడ్డు మెరుస్తోంది. నల్లటి తారురోడ్డు.

కారు మెరుస్తోంది. నల్లటి ఫియెట్.

రూప చీరె మెరుస్తోంది. నల్లటి చీరె.

ఆ చీరెలో ఆమె నల్లరాతి శిల్పంలా వుంది.

నాగినిలా వుంది.

వున్నట్టుండి కారు స్పీడ్ హెచ్చించింది రూప.

అకారణమైన వేగం.

నాకు భయం వెయ్యలేదు. కాని, ఆమె ప్రవర్తన అంతుపట్టక ఆశ్చర్యపడ్డాను.

స్టేడియం దాటొచ్చేక అప్పుడు స్పీడు తగ్గించింది రూప.

సిగిరెట్టు పీకని-నాజూగా నిదానంగా అవతలికి గిరాటెట్టింది. నాకేసి తిరిగింది. నవ్వింది.

"ఏమైనా మాట్లాడకూడదూ?-" అంది.

"ఏం మాటాడను? నువ్వే ఏదైనా చెప్పు..."

"భరించగలవా?-"

"అంత విషాదమా? లేక-అంత వినోదమా?-"

"భరించలేనంత బోరు-"

"బోరయితే భరించడం కష్టమే! నీకు అ[illegible]లైనవారూ లేరూ?-రాజాగారు తప్ప-"

"అయినవాళ్ళు - వున్నారు. వాళ్ళకి నేను లను. చచ్చిపోయేను-"

"అదెలా గు-"

"రవయితవి. వూహించు"

వూహించడాన్ని అభినయించేను. "వూహూ - అందలేదు"

"అందనిది తే వొదిలెయ్యి-"

"నువ్వు తాగుతావా రూపా?-"

"ఎందుకొచ్చింది అనుమానం?-"

"నీకు తెలుసు-ఏ అనుమానం ఎందుకొస్తుందో.."

"నీతో మాటాడుతూంటే నాతో నేను మాట్లాడుకుంటున్నట్లుంది ఆనందరావ్... నీతో అబద్ధాలు చెప్పను నేను. సిగిరెట్లు-ఎల్. ఎస్. డి... ... అంతకుమించి దురలవాట్లు లేవు నాకు..."

"నిజానికి దురలవాటు అనేవి లేవేమో! మంచీ చెడూ నీతి అవినీతీ-న్యాయం అన్యాయం వీటిలాగే దురలవాట్లు-మంచి అలవాట్లు-అవీ రిలెటివ్ టెర్మ్స్) అనుకుంటాను-"

"... ... ..."

"వొకందుకు నాకు సంతోషంగానూ ఈర్ష్యగానూ వుంది రూపా!...స్త్రీవైనా నీకు కావలసిన స్వేచ్ఛ వుంది-"

"నా బానిసత్వం ఎలా తెలుస్తుంది నీకు?-"

"ఎలాంటి బానిసత్వం?-"

"ఆత్మ శరీరానికి చేసే బానిసత్వం-"

"శరీరమే ఆత్మకి బానిస కదూ?-"

"ఆత్మ బలే మాట!..."

"ఫిలాసఫీ చదివేవా రూపా?-"

"ఫిలాసఫీ 'చదివే' వాళ్ళు ఫిలాసఫీ స్టూడెంట్స్ మాత్రమే!.. అసలైన ఫిలాసఫీ జీవితమే నేర్పుతుంది..."

"ఏం నేర్పింది నీకు జీవితం?-"

"ఇంకా నేర్పుతోంది-"

"పోనీ ఇప్పటిదాకా-"

"నువ్వేమీ నేర్చుకోలేదు-అని నేర్పింది-"

"బానిసత్వమన్నావు - అది పోవడం యెల్లాగమ్మా?"

"బానిసత్వం పోవడమంటూ యెప్పుడూలేదు.. బానిస విధానం మారుతుంది. వాతావరణం మారుతుంది. దుస్తులు మారతాయి..."

నగరం శివార్లలోకొచ్చేం. కారాపింది రూప.

కళ్ళు చిట్లించి వాచీకేసి చూసుకున్నాను.

మూడుగంటలు.

"దిగి నడుద్దాం రా..." అంది రూప. తను దిగింది. నేనూ దిగేను.

నల్లటి తారురోడ్డు అటూ ఇటూ కూడా చీకట్లోకి కలుస్తోంది.

ఆకాశంలో నక్షత్రాల ధగధగ.

కీచురాళ్ళ ధ్వని.

దూరంనుంచి నగరం చీకటి సముద్రంలో దీపాల పడవలా వుంది.

రోడ్డు దిగి నడవసాగింది రూప. అది ఆమెకి అలవాటైన ప్రదేశంలా ఆమె ప్రవర్తిస్తోంది. కాని, ఆమె అంతకుముందు అలా అక్కడికెప్పుడూ రాలేదని తెలుస్తూనేవుంది. కొంతసేపటి వరకూ కళ్ళు చీకటికి అలవాటు కాలేదు.

"నీగురించి ఇంకేమీ చెప్పలేవా, రూపా?-"

"చెప్పగలను. చెప్పను."

"ఏం?-"

"చెప్పకుండుక్కాదు జీవితం -"

"రహస్యమా జీవితం?-"

"అందరికీ తెలిసిన అతిరహస్యం-"

నడిచి నడిచి వొకచోట ఇసుకలో కూలబడింది. "ఇహనే నడవలేను-"

చీకట్లో ఆమె కళ్ళు తప్ప ఇంకేమీ కనిపించడంలేదు. మసక వెన్నెలుంది మరీ హీనంగా. ఆమె బుగ్గమీద మెరవనైనాలేదు.

ఏమీ మాట్లాడలేదు నేను.

"చలిగావుందా ?" అంది రూప. "కారో వెనకసీట్లో శాలువా వేసుకునే వొచ్చేను-పోయి తీసుకురానా ?-"

"వొద్దు-"

మళ్ళీ నిశ్శబ్దంగా వుండిపోయింది రూప.

వున్నట్టుండి- "నువ్వింకా పెళ్ళెందుకు చేసుకోలేదు ?-" అంది.

చేసుకోలేదని మాత్రం ఆమెకు రూఢే!

"అమ్మాయి దొరకలేదు-"

"ఎలాంటిది ?-"

"అందంగా వొద్దు-డబ్బుతో వొద్దు - చదువొద్దు నన్ను ప్రేమించేది-"

"అంటే ?-"

"నాకు చలేస్తుందేమోనని నన్ను చూడకముందేకూడా నాకోసం శాలువా వెంటతెచ్చేది-"

"వెంటతెచ్చి-ఇవ్వకుండా వుండే నాలాంటిది?-"

"నువ్వెప్పుడే ఎందుకివ్వలేదో నాకు తెలుసు"

"అనంగరావ్ జీ!-ఐలె క్యూ...ఐదేళ్ళ క్రితం అయితే బహుశా నిన్నే పెళ్ళాడేదాన్ని"

"నక్షత్రాలు చూడు-" అన్నాను పూర్తిగా సమ్మంధం లేకుండా మాట మార్చి- "ఓరియన్ అంటే నా కిష్టం-"

"జీవిత సమస్యల్ని మృత్యువు పరిష్కరిస్తుందంటావా ?-"

"జీవితం అసలొక సమస్యకాదు. ఒక కళ. బాగా బ్రతికే వాళ్ళందరూ మంచి ఆర్టిస్టు లన్నమాట..."

"మరి-నామాట ?-"

"నామాటే నీమాటాను - మనం తపస్సు చెడిన కళాకారులం-"

"కారణం ?-"

"కళని మరీ స్వచ్ఛంగా బ్రతకాలనుకోవడమే !-"

"కళనే బ్రతకడమా ?-"

"అవును"-

ఈదురుగాలి వీస్తోంది చీరెని భుజాలచుట్టూ తిప్పి కప్పుకుంది రూప. జరీ బోర్డర్ మెరిసింది. "పాటలొస్తే పాడు-" అంది.

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

ఆంధ్రపత్రిక

ఇప్పుడు ఎన్నో సరికొత్త శీర్షికలతో వెలువడుతోంది.

విడి ప్రతి వెల 30 పైసలు

......చందా వివరాలు......

సంవత్సరమునకు	ఏజెంటు ద్వారా	రు 108-00	పోస్టుద్వారా	రు 115-20
ఆరు మాసములకు	,,	రు. 54-00	,,	రు 57-60
3 మాసములకు	,,	రు. 27-00	,,	రు 28 80
1 మాసమునకు	,,	రు. 9-00	,,	రు 9-60

"చచ్చిపోయేప్పుడు తప్ప-పాడను-అదే ఆఖరు సంగీత ప్రయత్నం..."

సరిగ్గా నా పాలసీ..."

అలా నా ప్రతి మాటకీ బదులు చెప్తూనే వుంది రూప. నవ్వడంలేదు. చిలిపిగా మాటలు నాన్చడంలేదు. నగరంలోని రూపకూ నగరం శివార్లలోని రూపకూ పోలికేలేదు!

నీ మీద నవల రాస్తానేమో!-" అన్నాను చివరికి.

"ఆడపిల్లలమీద రాసే అలవాటు-మంచిదికాదు-"

"నీ పెర్మిషన్‌తో-"

"వూహూం-పెర్మిషన్ నేనివ్వను, నువ్వు రాసినా ఏమీ అనుకోను. నువ్వు రాసి అది అచ్చయినా-నేను చదవను..."

"వెళ్దామా ఇహ-" అన్నాను లేస్తూ.

మౌనంగా తనచేయి అందించింది. మాటవరసకి నా చేయూతే గాని తను పువ్వులా తేలిగ్గా లేచి నిలుచుంది. "నువ్వు మరీ బుద్ధిమంతుడివనుకోవాలా నేను?-" అంది ప్రక్కనే నడుస్తూ.

కెరటం బద్దలైంది.

వొక్కసారిగా దగ్గరికి లాగి హత్తుకుని ముద్దు పెట్టుకున్నాను.

ఆ చీకట్లో, ఆ క్షణమే చచ్చిపోయుంటే అది స్వర్గం

"కొంచెం బుది మంతుణ్ణే నేను-

"పెళ్ళి చేసుకో-ఆ వుండే బుద్ధి కూడా పోతుంది-'

వొ:లేదు ఆమెనింకా నేను.

చేతుల్లో అలాగే నిలిచింది-"మనం స్నేహితులం!-"

"శరీరాల్లేని ఆత్మలమైతే బాగుణ్ను!-" అన్నాను.

"శరీరాలున్నా-ఆత్మలం అని గుర్తుంచుకో చాలు...నిండైన మనిషివి ఔతావు-"

తల తిరిగిపోయింది నాకు.

ఎంత తేలిగ్గా సునాయాసంగా చెప్పింది-సత్యాన్ని!

ఆ భావన సాధించడంకోసం ఎన్ని పుస్తకాలు చదివేను! ఎన్ని వుపన్యాసాలు విన్నాను!!

"ఆనందరావ్-ఐ లైక్యూ-దా-పోదాం-దా-" అని రెండో క్లాసు కుర్రాడికి ఐదోక్లాసు ఆడపిల్ల చెయ్యందించినట్టు అందించింది.

కారు నగరంలోకొచ్చేసరికి నా గుండెలో గుబులు రేగింది. టవర్ క్లాక్ దగ్గిర ఆగేప్పటికి గొంతు తడారిపోయింది.

"మళ్ళీ ఎప్పుడు రూపా?-"

"వొకసారి వుండడం. అంతే. మళ్ళీ-అనేది భ్రమ. అనంతంలో త్రికాలాలు లేవు. వున్నదొకటే కాలం. అది-నిత్యం..."

"మనం ఎలా కలిసేం? ఎందుకు విడిపోతున్నాం?-"

"నిన్నటిదాకా మనం కలవలేదు. రేపట్నుంచి కలవం. నిన్నా రేపులో కలవడంలేదు. మరి నేటి కలయిక? ఏమౌతుంది? ఆలోచించు! కలిసినా కలవనట్టే! కలవకపోయినా కలిసినట్టే-"

"అదెలాగు?-"

"ఆలోచించు-వందేళ్ళక్రితం నువ్వూ లేవు నేనూ లేను. మరో వందేళ్ళ తర్వాత నువ్వూ వుండవు, నేనూ వుండను. అప్పుడు ఇద్దరమూ లేము, ఇప్పుడు ఇద్దరమూ వున్నాము- వుండడంలోనూ లేకపోవడంలోనూ మనిద్దరం వొకటే. లోకానికి ఇద్దరం-మనకు మనం వొక్కటే-"

దుఃఖం వల్లనో, ఆనందం వల్లనో కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగేయి. నా చేతిని అందుకుంది రూప. నిండుకళ్ళతో నాకేసి చూసింది. సృష్ట్యాదినుంచి వున్న అన్ని చీకటి రాత్రుల్నీ ఇముడ్చుకున్న కళ్ళవి!

"నేస్తం! నన్ను గుర్తుంచుకో! నువ్వంటే నా కిష్టం-! ఐ లైక్యూ! ఐ లవ్ యూ!......"

రివ్వున రూపకారు దూసుకుపోయింది. నల్లటి రాత్రిలో నల్లటి తారురోడ్డు మీద నల్లటి కార్లో నల్ల చీరెలో రూప-చీకటిలో కాటుక నలుపులా కలిసిపోయింది.

వొక్కణ్ణే మిగిలేను నేను, కాని-

లెక్కలేనన్ని మెరుపులు మెరుస్తున్నాయి నాలో...

* * *

గదికి చేరుకున్నాను.

జరిగినవన్నీ వొకటి వెంట వొకటిగా కళ్ళముందు కదుల్తున్నాయి.

అయిదుగురు-మనుష్యులు!

అయిదు పాత్రలు!

ధనపతి, కైక, పొన్నమ్మ, చంద్రకాంత్, రూప-

వొక్కరొక్కరే వొచ్చేరు.

తమ గురించి తాము చెప్పినంత చెప్పగలిగినంత చెప్పేరు.

తమ గురించి రాయమన్నారు ఇద్దరు. రాస్తే రాయమన్నా

ఒకరు. రాయొద్దన్నారొకరు. రాయడమంటే ఏమో తెలీక - దాన్ని గురించి నిర్లిప్తంగా వెళ్ళిపోయేరొకరు.

టేబిల్ మీది కాగితాలు నావేపు తెల్లగా శూన్యంగా చూస్తున్నాయి.

దీనంగా పడుకుంది నాకలం!

ఎవర్ని గురించి రాయాలి?-ఏం రాయాలి నేను?

నవల రాస్తే చాలు - తను అచ్చు వేయించుకుంటానన్నాడు ధనపతి. తన గురించి నేను రాయాలి! రాస్తే - వొస్తే, అతని కొడుకు తిరిగి రావొచ్చు. నాకు ఏదో కొంత సంభావన ధనపతిగారి ద్వారాకూడా ముట్టొచ్చు. కాని ధనపతి కథలో కొత్తదనంలేదు చెప్పుకోదగ్గ ఉదాత్త లక్ష్యంకూడా లేదు. కుటుంబ కలహం గురించి రాస్తే తప్పులేదు. ఇంకే అన్యాయాలకి లొంగక అది కేవలం కుటుంబ కలహమే అయి వూరుకుంటే దానివల్ల సాంఘిక ప్రయోజనంకూడా అట్టే వుండదు.

"ఆడామగా మధ్య ఆర్థిక కారణాలవల్ల ఈదోపిడీ ఇలా నిరంతరం జరగాల్సిందేనా?-" అని ధిక్కరించి ప్రశ్నించి, అలా జరక్కూడదనీ, జరక్కుండా చూడాల్సిన బాధ్యత నామీదావుందనీ చెప్పింది కైక. "నిజానికి నామీదరాస్తే - ఈతరం ఆడపిల్లల మీద రాసినట్టు-" అంది. మాటవరసకి నేను కైక మీద కైక చెప్పిన కథే రాస్తే-ఈతరం ఆడపిల్లలు హర్షిస్తారా? నన్నో స్త్రీద్వేషి కింద జమకట్టేవాళ్ళు కొందరైనా వుండకపోతారా?? ఏమో! నాకసలే స్త్రీలంటే భయం. ఎంతటి రచయితైనా స్త్రీ పాఠకుల సానుభూతి లేకపోతే రాణకెక్కలేడు. స్త్రీలకి అప్రియాలురాసి నేను బ్రతికి బట్టకట్టగలనా?

మొగుడు చంపేస్తున్నాడంటూ కేకలేసుకుంటూ మధ్యాహ్నం పారిపోయొచ్చిన పొన్నమ్మ సాయంత్రానికల్లా వాడికి స్నానానికి వేణ్ణీళ్ళు పెట్టాలని గుడిసెకెళ్ళిపోయింది. పొన్నమ్మ కథని నవలగారాస్తే, పాఠకులూ, పాఠకీమణులూకూడా హర్షిస్తారు. కాని, పొన్నమ్మ భాష నాకురాదు. వాళ్ళ జీవితాల్తో ప్రత్యక్ష పరిచయంకూడా నాకులేదు. చూడకుండా అనుభవించకుండానే చూసినట్టూ అనుభవించినట్టూ రాయడం కష్టంకాదుగాని నికృష్టం. నాకిష్టంలేదు. పొన్నమ్మ కథని నేనిప్పుడప్పుడే రాయలేను.

ధనపతి బూర్జువా మనిషి. కైక మధ్యతరగతి ఆడపిల్ల. పొన్నమ్మ పీడిత వర్గానికి చెందిన స్త్రీ. వీళ్ళు ముగ్గురినీ వర్గ దృక్పథంతో పరిశీలిస్తూ సాంఘిక వివరణాత్మక విశ్లేషణాత్మక నవల రాద్దామంటే-వూహూఁ-లంకెలందడం లేదు.

చంద్రకాంత్ మనసు నా మనసుతో నా మెదడుతో చేసిన గారడీతో ఒక చైతన్యస్రవంతి నవల రాయొచ్చు. అల్లాటప్పా కబుర్లు చెప్పి అదే చైతన్య స్రవంతి అని చెప్పన్నేను. చైతన్య స్రవంతంటే-అదో కత్తిమీదసాము. అంత సాహసం నాకిప్పుడులేదు.

తన గురించి ఏమీ రాయొద్దంది రూప. రాయాలనుంది నాకు. కాని, రూప మీద కూడా ఏమీ రాయలేనేమో! రూపగురించి రాయడమంటే నా అంతరాత్మగురించి నేను రాయడమన్నమాట! అంత ఆధ్యాత్మిక పరిపక్వత నాలో ఇప్పుడు లేదు. లేని దానికి విచారం లేదు. వయసురాకుండా ముదిరిపోయినా ప్రమాదమే!

ఈ అయిదు పాత్రలు చెప్పిన విషయాల్ని ఒకదాన్తో ఒకటి కలబోస్తే?-అనే ఆలోచనకూడా వొచ్చింది నాకు! -

కైకను గత చరిత్రపేరిట ఫీజు కొట్టి మోసం చేసింది ధనపతి కొడుకు కళాయే అని చెప్పొచ్చు. ఆ కళాయే ఈ యస్. గోపాలం! ఏం? - ఇహపోతే - రూప ఎవరు? ఆవిణ్ణిపోషించే ఆ రాజుగారెవరు? సౌకర్యంకోసం కావలిస్తే ఈరెండు పాత్రల స్థలాలూ మార్చెయ్యొచ్చు. ధనపతి ఏకపత్నీవ్రతుడు కాడని వాదించడం పెద్ద కష్టంకాదు. నిజానికి వాదించనవసరం లేదు! (అఖిలాదేవికీ ఆయనకీ - సయోధ్య ఎన్నడూ లేదు కూడాను!) మరి పొన్నమ్మ గతేమిటి? - ఆమె భర్తని రిక్షావాడుగా కాక ఫ్యాక్టరీ వర్కర్‌గా చిత్రిస్తే!? అతణ్ణి - ధనపతి మనుషులచేత 'యాక్సిడెంట్'లో చంపిస్తే!? అన్నట్టు చంద్రకాంత్ ఏం కావాలి? అతడే కైక తొలి ప్రియుడు గోపీ సుందరం అనేస్తే? - మిగతా లంకెలు సరిపోతాయా? - ఎలాగైనా సరిపెట్టాలి! అన్నీ సరిపడితే-ఏదో ఒక నవల తయారు చెయ్యొచ్చు ... ...

వున్నట్టుండి జ్ఞానోదయం అయింది నాకు. నా ఆలోచనలో గల పెద్ద లోపం తెలిసొచ్చింది.

ధనపతి-కైక-పొన్నమ్మ-చంద్రకాంత్-రూప ... వీళ్ళవి నిజమైన కథలుకావు. వీళ్ళంతా నన్ను పలకరించడానికొచ్చిన పాత్రలు. అంతే!

వీళ్ళ జీవితాల్ని నేనెలా కలపగలను?

ఎలానూ కలపలేను.

అన్నట్టు ఈ పాత్రలైనా నాకు పూర్తిగా అర్థం కాలేదు. నిజానికి వాళ్ళకి వాళ్ళే అర్థం కాలేదు. ఆసంగతి వాళ్ళుకూడా ఒప్పుకుంటారు! ఇహ నాకేం అర్థం ఔతారు?

పాత్రలు తమకి తామూ అర్థంకాక, రచయితకీ అర్థంకాక-అలాంటి పరిస్థితిలో రచన సాగితే(!) ఇహ నవల పాఠకులకి మాత్రం ఏమర్థమౌతుంది? పాఠకులకి అర్థం కాకూడదనే రాసేవాళ్ళుంటే వుండొచ్చుగాక, నాపద్ధతి అది కాదు.

శవాన్ని వెన్నెక్కించే భేతాళుడిలా కాగితాలూ కలం మేజా సొరుగులోకి తోసేసేను.

వూహూఁ-నేను నవల రాయను

(అయిపోయింది)